క్లుప్తంగా

కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



పందలపాకలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో రెడ్డి కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో పాటు దాతల సహకారంతో భవన నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలోని జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, సర్పంచ్ సబ్బారపు పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైట్‌లో ఉత్సాహంగా వై-20

రాజానగరం: భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం 'వై - 20' కార్యక్రమం నిర్వహించారు. హెల్త్, వెల్ బీఈంగ్ అండ్ స్పోర్ట్స్ అజెండా ఫర్ యూత్‌పై బీకే మంజునాథ్, డాక్టర్ శ్రీరామ్ సుధామ్‌శెట్టి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, గురువులు, సమాజంతో ఏవిధంగా వ్యవహరించాలి, దేశాభ్యున్నతికి ఏవిధంగా తోడ్పడాలనే విషయాలను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాంబాబు రెడ్డి, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి పాల్గొన్నారు.

సర్వే 69 శాతం పూర్తి

బిక్కవోలు: మండలంలో సిటిజన్ అవుట్ రీచ్ సర్వే 69.76 శాతం పూర్తయిందని ఎంపీడీవో జేఏ ఝాన్సీ శనివారం తెలిపారు. మండలంలోని 25,357 కుటుంబాలకు గాను 17,690 కుటుంబాల సర్వే పూర్తయిందని చెప్పారు. బలభద్రపురం-3 సచివాలయంలో అత్యధికంగా 87.84 శాతం, ఇలపల్లి సచివాలయంలో అత్యల్పంగా 48.81 శాతం పూర్తి చేశారన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

అనపర్తి: విద్యుత్ వినియోగదారులు తమ ఆధార్ నెంబర్‌ను విద్యుత్ సర్వీసు నెంబరుకు తప్పనిసరిగా అనుసంధానించుకోవాలని డీఈఈ పి.సన్యాసిరావు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, బిల్ కలెక్టర్, రెవెన్యూ క్యాషియర్, గ్రామ సచివాలయం, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విద్యుత్ అధికారుల వద్ద ఆధార్ నెంబర్ లింక్ చేయించుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ సేవలకు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ప్రారంభోత్సవం

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు తేతలి సుమ శనివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అభిమానులు తరలిరావాలన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

గోకవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ జరిగింది. ఎంపీడీఓ పద్మజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీలో డ్వామా పీడీ పి.జగదాంబ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ ద్వారా రూ.12.90 కోట్లతో వంద రోజుల పనిదినాలు కల్పించిన 771 పనులకు తనిఖీ నిర్వహించారు. వీటిలో ఉపాధి హామీ ద్వారా 712 పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 42 పనులు, సర్వశిక్ష అభియాన్ ద్వారా ఆరు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 11 మినీ గోకులం పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆయా పనుల వద్ద పనులకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రూ.92 వేలు రికవరీకి ఆదేశించారు. గంగంపాలెం సింహాద్రి చెరువు మస్తర్లలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు డ్వామా పీడీ ఎదుట ఆరోపించారు. దీనిపై విచారణకు డ్వామా పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్ఆర్పీ బి.తులసీనాయక్, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో 180 ఎంఎల్ పరిమాణంతో ఉన్న ఆరు మద్యం సీసాలను కలిగిన జంపా సత్యనారాయణను అరెస్టు చేసినట్లు రంగంపేట ఎక్సైజ్ సీఐ జి.వెంకటలక్ష్మి శనివారం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

రూ.పదివేలు చోరీ

సీతానగరం: చినకొండేపూడికి చెందిన సైయ్యపురాజు గంగాభవాని ఇంటిలో రూ.పదివేలు చోరీకి గురయ్యాయి. ఈనెల 3న గంగాభవాని తన కుమార్తెను చూడటానికి కాకినాడ వెళ్లి, శనివారం తిరిగి వచ్చారు. ఇంటి వెనుక ఉన్న మెస్ తొలగించి లోపల ఉన్న వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా రూ.10 వేలు దొంగిలించినట్లు గుర్తించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా మదర్ జయంత్యుత్సవం



సీతానగరంలో మదర్ థెరిసా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మదర్ థెరిసా సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం సీతానగరం సేవా సమితి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, డాక్టర్‌బాబు మిత్ర మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రక్తదాన శిబిరం, దివ్యాంగుల పిల్లలకు దుస్తుల పంపిణీ, స్కూళ్ల విద్యార్థులకు పుస్తకాల వితరణలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎందరో రోగులకు నిస్వార్థ సేవలందించిన మానవతామూర్తి మదర్ థెరిసా అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని డాక్టర్ బాబు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇప్పటి వరకూ ఆయన 123 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, చల్లమళ్ల సుజీరాజు, అంబటి రాజు, గోపిశెట్టి అచ్చారావు, వలవల సత్తిబాబు, వంగలపూడి సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ద్వారంపూడి రామకృష్ణ, వలవల వలి, గద్దె వీరన్నబాబు, మద్దాల కొండలరావు, కోలా శ్రీను పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల, కోరుకొండ, బూరుగుపూడి గ్రామాల్లో మదర్ థెరిసా జయంత్యుత్సవాలు నిర్వహించారు. గాడాల భాను పబ్లిక్ స్కూల్‌లో కరెస్పాండెంట్ జక్కంపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు. కోరుకొండ షిర్డీసాయి ప్రిన్సిపల్ లక్ష్మీ పద్మావతి, సృజనా స్కూల్ కరస్పాండెంట్ షణ్ముఖ్ తదితరులు మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మదర్ థెరిసా మాటలు అక్షర సత్యాలు

బిక్కవోలు: 'మనిషికి మరణం ఉంటుంది గాని మానవత్వానికి ఉండదు' అన్న మదర్ థెరిసా మాటలు అక్షర సత్యాలని కొంకుదురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ అన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా శనివారం పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ మదర్ థెరిసా మానవ సేవే మాధవ సేవ అని తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేడపాటి లక్ష్మణరెడ్డి, శ్రీకృష్ణ సాయి, పడాల ఈశ్వర్‌రెడ్డి, అప్పారావు, వలీషా, సుధాకర్‌రెడ్డి, జ్యోతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొంకుదురు పాఠశాలలో మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఇస్రో బృందంలో రఘుదేవపురం కుర్రాడు



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో సతీష్

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన మామిడి సతీష్ ఎనిమిదేళ్లుగా బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్ 3 విజయవంతంగా చంద్రునిపై కాలుమోపిన సమయంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ పక్కనే సతీష్ సంబరాలు చేసుకున్నారు. దీనిపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన మామిడి మంగారావు, రత్నం దంపతుల నాలుగో కుమారుడు సతీష్ ఈ గొప్ప ప్రయోగంలో భాగస్వామి కావడంపై అభినందిస్తున్నారు.

30న వాహనాల వేలం

రంగంపేట: మండలంలో సారా తరలింపులో స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలను ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జి.వెంకటలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డు జిరాక్స్ అందజేయడంతో పాటు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలం పాటలో పాల్గొనొచ్చన్నారు.

వైద్యశిబిరాలతో మెరుగైన సేవలు



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యశిబిరాలు ఎంతో దోహదపడతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రఘుదేవపురంలో శనివారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీఎస్ఎల్, సుభద్ర హాస్పటల్ సౌజన్యంతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పర్యవేక్షణలో వైద్యశిబిరం నిర్వహించారు. షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో 40 మంది ప్రముఖ వైద్య నిపుణులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ శిబిరంలో 774 మందికి వైద్యసేవలు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ సిబ్బంది, జీఎస్ఎల్ కాలేజీ వైద్యులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు 35 శాతం పూర్తి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: మండలంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ఇప్పటివరకూ 35 శాతం పూర్తయిందని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. శనివారం ఆయన దోమాడ గ్రామంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ సుమారు 6,300 ఎకరాల్లో పూర్తయిందన్నారు. ఈ-క్రాప్ నమోదును వచ్చే నెల 15 నాటికి వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సత్యరథానికి భక్తుల ఘన స్వాగతం



కోరుకొండలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మధురపూడి: అన్నవరం సత్యనారాయణస్వామివారి సత్యరథానికి శనివారం కోరుకొండలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారిని ఆహ్వానించారు. సత్యరథం కాపవరం సెంటర్ నుంచి ఊరేగింపుగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో రద్దీ ఏర్పడింది. నరసింహస్వామి దేవాలయం ఆవరణలో రథాన్ని ఉంచారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మండలంలోని శివారు గ్రామమైన పశ్చిమగానుగూడెం వరకూ భక్తులు తోడుగా వెళ్లి రథానికి వీడ్కోలు పలికారు. అక్కడి నుంచి రథం గోకవరం మండలానికి వెళ్లింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి పాల్గొన్నారు.

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలో శనివారం రథయాత్ర శోభాయమానంగా జరిగింది. ఆదివారం గ్రామంలోని శ్రీరామగిరి కొండపై సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- టీడీపీ నాయకుల ఆరోపణలు అవాస్తవం



సీతానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. సీతానగరంలోని జీవీకే కన్వెన్షన్ హాల్లో శనివారం మండలంలోని కొన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాసేవకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో తమ కుటుంబమంతా ప్రజాసేవ చేయడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. టీడీపీ తమపై చేస్తున్న అవినీతి ఆరోపణల్లో ఎక్కడా వాస్తవం లేదన్నారు. నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు, మరో రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. సీతానగరం - కాతేరు నాలుగు లైన్ల రోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో రూ. 216 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి పనులు త్వరలో శ్రీకారం చుడతామన్నారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అందరూ కలిసి పనిచేసి, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేయాలన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తనయుడు లోకేష్‌కు జయంతికి వర్ధంతికీ తేడా తెలియదన్నారు. ఎన్నికల్లో గెలవకుండానే మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. లోకేష్ యువగళం పేరిట చేస్తున్న పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ఆయనకే తెలియదన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు వలవల వెంకట్రాజును మండల ఆర్జీకే చైర్మన్‌గా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సత్తిపండు రాజు, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం - సీతానగరం నాలుగు లైన్ల రోడ్డును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాత్రి 11 గంటలకు పరిశీలించారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం రాపాక గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రాపాక అభివృద్ధికి కేవలం రూ.20 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని, నేడు వైఎస్సార్ సీపీ నాలుగేళ్లలో రూ 2.95 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు అంబటి రాజు, కవల కృష్ణమూర్తి, పిచ్చుకల రవికుమార్, పిచ్చుకుల విజయ్ కుమార్, రావూరి రామరాజు, ముత్యాల సత్తిబాబు, ముత్యాల బాలకృష్ణ, మాగంటి హరి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ప్రగతికి చేయూత

రాజానగరం: మహిళా సమానత్వం, మహిళాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రగతి వైపు ప్రతి మహిళా అడుగులు వేయాలని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీ మాధవి అన్నారు. కళాశాలలో లింగ సమానత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సావిత్రి, జి.రాజ్యలక్ష్మి, ఎ.హేమసాయిలత పాల్గొన్నారు.